

# భవానీద్వీపం

## –వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 41 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ప్రహరీ గుమ్మంనుండి లోపలి దృశ్యం గుండెలు పిండేసేలా కనిపిస్తున్నది. శరీరంలోని శక్తి అంతా హరించుకునిపోయింది శాస్తుర్లు గారికి. వడలిపోయిన తోటకూర కాడలా వ్రేళ్ళాడబడిపోయాడు. దాదాపు ఎత్తుకున్నట్లుగా పొదివిపట్టుకుని ఆయనను నడిపించారు రెండుప్రక్కలా వున్నవాళ్ళు.

చాపమీద పడుకున్నట్లుగా వున్నది పార్వతమ్మ. నిర్జీవమైన గాజుకళ్ళతో శూన్యంలోకి చూస్తున్నట్లుంది.గజనిమ్మపండు రంగులో మిసమిసలాడే శరీరం నీలిరంగులోకి మారిపోయింది. నోటివెంట వుబికినట్లుగా వస్తున్నది తెల్లని నురుగు. చెంపలమీదుగా జారి, చెవిని నింపి చాపమీదకు కారుతున్నది. గుండెలు బాదుకుంటూ శోకాలు పెడుతున్న ఇరుగుపొరుగు స్త్రీలు ఆమె పైట చెంగుతో తుడిచినా కొద్దిసేపటికే మరలా చాపను తడుపుతున్నది నురుగు. తల్లి ప్రక్కనే కూర్చుని ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని నిమురుతూ మౌనంగా రోదిస్తున్నాడు నాగుమయ్య. ధారలుగా కారుతున్న కన్నీటిని తుడుచుకోడం కోసం కూడా తల్లి చేతిని వదలడం యిష్టం లేనట్లుగా వున్నది. శాస్తుర్లుగారు తడబడుతూ సమీపించగానే ఒక్కసారిగా ఘొల్లున ఏడుపులు మిన్నుముట్టాయి.

కొడుకు భుజం మీద చేయి వేసి, కొబ్బరిచెట్టు కూలినట్లు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు శాస్తుర్లుగారు. భార్యతలను తన ఒడిలోకి తీసుకున్నాడు. తీవ్రమైన దుఃఖంతో శ్వాస తీసుకోవడానికి కూడా శక్తిలేనట్టుగా సొమ్మసిల్లిపోయాడు. తల వాల్చి వెనక్కు ఒరిగిపోతుంటే చప్పున తండ్రిని పడకుండా పట్టుకున్నాడు నాగుమయ్య. హాహాకారాలు చెలరేగాయి. ముఖం మీద నీళ్లు చల్లి కొద్దిసేపు విసిరిన తర్వాత కళ్ళు తెరిచాడు శాస్తుర్లుగారు.

కొడుకు చేతిలో వున్న భార్య చేతిని చూసి అంతా అర్థం చేసుకున్నాడు. గాడిపొయ్యిలో కాలుతున్న తుమ్మకట్టెలాగా నల్లగా మాడిపోయి వున్నది పార్వతమ్మ పచ్చని చేయి. మణికట్టు దగ్గర గట్టిగా కొరికినట్లు గుర్తులు కనపడుతున్నాయి. చటుక్కున నిర్ఘాంతపోయినట్లు చిన్నకొడుకు ముఖంలోకి చూశాడు. అలుగులెత్తటానికి సిద్ధంగా వున్న చెరువుల్లా వున్నాయి నాగుమయ్య కళ్లు. చుట్టూ కలయజూశాడు శాస్తుర్లుగారు. వెనక్కు తలతిప్పి పెద్దకొడుకును వుంచే గది కిటికీ వైపు చూశాడు.

పెద్ద కొడుకు కోసం తండ్రి వెతుకుతున్నాడని అర్థం చేసుకున్నట్లుగా 'లేదు, చేతిని కొరికి పారిపోయాడు. పట్టుకోడానికి వెంటబడ్డవాళ్లను మీదపడి కొరకడానికి రక్కడానికి తెగబడ్డాడు. చేలకు అడ్డంపడి పాండవులగుట్టవైపు పారిపోయాడు' అని భోరుమన్నారు నాగుమయ్య. అంతవరకూ బిగపట్టుకున్న శోకం అలల లాగా విరుచుకుపడింది. నాగుమయ్య విలపించడం మొదలుపెట్టగానే ఆ ప్రాంగణం మొత్తం ఆర్తనాదాలతో బ్రద్దలయ్యేలా పెద్దపెట్టున రోదించడం మొదలుబెట్టారు అందరూ.

పల్లె మొత్తం ఆ ప్రాంగణంలో కిక్కిరిసిపోయి వుంది. నాగుమయ్య వారికి దేవుడితో సమానుడు. చిన్నా పెద్దా గొడవల పరిష్కారాలకు నాగుమయ్య వద్దకే వస్తారు. ఎంత పెద్ద రోగమైనా నాగుమయ్యే వాళ్ళపాలిటి ధన్వంతరి. విషసర్పాల కాటుకు, విరుగుడుకు వాళ్ళపాలిటి అపర గరుత్మంతుడు నాగుమయ్య. వయసు నిండా పద్దెనిమిది ఏళ్ళే అయినా, నాగుమయ్య కంటి చూపు వాళ్ళపాలిటి రాజశాసనం. పూర్వజన్మలో ఏ మహానుభావుడో అర్థాంతరంగా తనువు చాలించి, మళ్ళీ యిప్పుడు తమకోసం నాగుమయ్యగా అవతరించాడని నమ్మకం ఏర్పడిపోయింది వారందరికీ. అటువంటి నాగుమయ్య ఒక్కసారిగా పెద్దగా రోదించడం మొదలెట్టగానే గ్రామమంతా శోకంతో భళ్లుమన్నది.

'అయ్యో చెప్పి పోతినే నాయనా! కనిపెట్టుకొమ్మని చెప్తినే..' అంటూ కొడుకును భుజాలు పట్టుకుని కుదుపుతూ కుమిలి కుమిలి రోదిస్తున్నాడు శాస్తుర్లుగారు. మధ్య మధ్య మౌనంగా తనలో తానే గతం తాలూకు జ్ఞాపకాలను తడుముకుంటూ గొణుగుతున్నట్లు శోకాలు పెడుతున్నాడు. తెప్పరిల్లడానికి ప్రయత్నం చేస్తూనే మరింతగా శోకంలో కూరుకుపోతున్నాడు. ' ఆయన అప్పుడే చెప్పాడు! అది దేవజాతి సర్పం! ఆ నాగదోషమే నన్ను నాశనం చేసింది' అంటూ మళ్ళీ భోరుమన్నాడు.

పరుగున వచ్చి కుప్పకూలిపోయాడు గ్రామస్థుడొకడు. బిగ్గరగా రోదించడం మొదలుబెట్టాడు. 'నాగుమయ్య దేవుడు! ఆ బాబు తప్పేమీ లేదయ్యా! నేనే బలవంతంగా నా బిడ్డను బతికించండి బాబూ అని నా యింటికి తీసుకెళ్లా! పెళ్లీడుకొచ్చిన పిల్ల! తెల్లవారుఝాముున ఏ విషపు పురుగు కరిచిందో నురగలు కక్కుతూ మల్లెపొదలో దొర్లుతుంటే మా యింటిది చూసింది. అది శోకాలు పెడుతుంటే చప్పున మీ కోసం పరుగెత్తుకొచ్చా ! అప్పటికి తమరి కచ్చడం మూలమలుపు తిరుగుతున్నది. నీకేం భయం లేదు. నేనున్నానుగా అని భరోసా యిచ్చి నావెంట వచ్చాడు నాగుమయ్య. నోట్లో ఏదో మందు పోశాడు. చెవిలో యేవో మంత్రాలు చదివాడు. చేయిదాటిపోయింది అనుకున్న బిడ్డ అప్పుడు కళ్ళు తెరిచింది. యింతలోనే తమరికి యింత ఘోరం జరిగింది' ఏడ్పు మధ్య జరిగింది వివరిస్తూ గుండెలు బాదుకుంటూ ఏడవడం మొదలుబెట్టాడు.

చటుక్కున తన దుఃఖాన్ని దిగమింగుతూ చిన్నకొడుకు ముఖంలోకి చూశాడు శాస్తుర్లుగారు. ' అవును ' అన్నట్టు తల వూపుతూ, తల్లి ముఖాన్ని నిమురుతూ మౌనంగా కన్నీరు కార్చాడు నాగుమయ్య. అప్పటికి దాదాపు రెండు సంవత్సరాలనుండి విచిత్రంగా విషసర్పాల తాకిడి ఎక్కువైంది నాగవరప్పాడులో. కేవలం ఈ సంవత్సరంలోనే ఆరుగురు యువతులు పాముకాటుకు గురి అయినారు. అందరూ పెళ్లీడుకొచ్చిన కన్యలే. అందరూ రాత్రి మూడవ ఝామున ఏ మల్లె పొదల్లోనో, సన్నజాజి పొదల్లోనో కాటుకు గురయ్యారు. విచిత్రంగా, కంటికి ఎక్కడా పాము కరిచిన కాట్లు కనబడలేదు ఎవరికీ! ఝాములోపు వార్త తెలిసి శాస్తుర్లుగారో, నాగుమయ్యో వెళ్లి చూసినవాళ్లు ముగ్గురు మాత్రం బతికి బయటపడ్డారు. ముగ్గురు అసువులుబాశారు. ఈ ఉదయం మరొక యువతి కాటుకు గురి అయ్యిందన్నమాట.

కూర్చునే శక్తి కూడా లేనట్టు చేతిమోపున గోడకు చేరగిలబడ్డాడు శాస్తుర్లు గారు. రోహిణీకార్తెలో వడగాలి దెబ్బతిన్న పిట్టలా నోరుతెరిచాడు. శోష వచ్చిందని గ్రహించి ఘోష పెట్టారు చుట్టూ వున్నవాళ్లు. నిముషాలలో మజ్జిగ తేట నాగుమయ్య చేతికి అందించారు. శాస్తుర్లుగారి ముఖాన చల్లటి నీళ్లు చిలకరించారు. విసనకఱ్ఱలతో విసిరారు.

మజ్జిగ తేట రెండు గుటకలు వేసిన తర్వాత నీరసంగా కనులు తెరిచాడు శాస్తుర్లుగారు. అప్పటినుండి యేదో కలలో జరుగుతున్న కథను చూస్తున్నట్లు వుండిపోయాడు ఆయన.

నాగవరప్పాడు పరిసర గ్రామాలన్నీ తరలివచ్చాయి వార్త తెలిసి. శోకసాగరంలా ఎగసిపడుతున్న వేలమంది సమక్షంలో భార్యకు అంత్యక్రియలు చేశాడు శాస్తుర్లుగారు. తల్లి చేతిని కొరికి పొదల్లోపడి పోయినవాడు తిరిగి రాలేదు పెద్దకొడుకు. ఇక రాడు అని తెలుసు శాస్తుర్లుగారికి, నాగుమయ్యకు.

పార్వతమ్మను సాగనంపిన పదమూడవ రోజు తెలవారుఝామునే చిన్నకొడుకుతో పెరట్లో తులసికోటముందు ఆవుపేడతో అలికించాడు. పోయిన పౌర్ణమి మరునాడు శాస్త్రోక్తంగా సేకరించిన దర్భలను కొడుకుతో పరిపించాడు. వాటిపై పొడవాటి జింకచర్మాన్ని నిలువునా పరిపించాడు. బ్రాహ్మీ ముహూర్తంలో మొదలుబెట్టి ప్రపంచాన్ని మరిచి నిశ్చలంగా ధ్యానం చేసుకున్నాడు. కళ్ళు తెరిచి చిన్నకొడుకును చేరువకు పిలిచాడు. తండ్రి చెప్పిన పనులన్నీ మౌనంగా చేసుకుపోతున్నాడు నాగుమయ్య. వచ్చి తండ్రికి ఎదురుగా కూర్చున్నాడు.

యిద్దరిమధ్యనా మంచుతెరలా మౌనం. 'ఇదంతా ఎందుకో..' తండ్రి మాటను పూర్తి చేయకముందే అందుకున్నాడు నాగుమయ్య " తెలుసు.. తెలుసు.." ఎంత నిభాయించుకున్నా నాగుమయ్య కళ్ళవెంట నీటిచెమ్మ కనిపించింది. ' వెళ్లిపోయే సమయం వచ్చింది నాయనా! ' కొంతసేపు మౌనం. వేసవి తెల్లవారుఝాము చిరు చల్లని పొడిగాలికి ఆకుల సన్నని ధ్వని కూడా స్పష్టంగా వినిపించే మౌనం. నాగుమయ్యకు తన గుండె చేసే చప్పుడు తనకు వినిపించే మౌనం.

తండ్రి 'నాగభూషణుడుంటే..' అంటూ ఆగిపోయాడు, పెద్దకొడుకును తలచుకుని. విరక్తిగా, విచిత్రంగా చిన్న నవ్వు నవ్వాడు. ' అంతా ఒక కల. కాలమనే పెద్ద కలలో జీవితం చిన్న కల! పెద్దకథలో చిన్న కథ! ' 'నా కారణంగా ఎంతమందికి ఎంత హానిజరిగింది!' అంటూ బాధగా తల దించుకున్నాడు. మళ్ళీ తనకు తానే చెప్పుకుంటున్నట్లు ' నా చేతిలో ఏముంది? యిలా జరగాల్సి వుంది, అంతే' అన్నాడు. 'నాగుమయ్యా! నాకు మాట యివ్వు! నీకై నువ్వు తొందరపడి..' అంటూ యిష్టంలేకనో, చెప్పలేకనో ఆగిపోయాడు. నాగుమయ్యకు తండ్రి చెప్పదలుచుకున్నది యేమిటో తెలుసు.

ఏమీ తెలియని పసివయసులో ఆటగా నాగమణిని మింగాడు తన అన్న. కొన్ని సంవత్సరాల తరువాతగానీ నాగమణి ఎలా మాయమయిందో గ్రహించలేకపోయాడు తండ్రి. అప్పటికే ఆ మణి పెద్దకొడుకు శరీరంలో దాదాపు కలిసిపోయింది. దానిప్రభావాన్ని చూపించడం మొదలెట్టింది. అతడి శరీరం రంగు మారింది. చర్మం వూడి, ఎప్పటికప్పుడు, ప్రతి పున్నమికి  కొత్త చర్మం రావడం మొదలుబెట్టింది. గోళ్లు పళ్ళు విషపు కోరల్లా అయ్యాయి. యింటికి పెద్దకొడుకు ఉండీ లేనివాడయ్యాడు. వాడికారణంగా, వంశానికి దిక్కుగా మిగిలిన చిన్నకొడుకు యే ఆపదకూ గురి కాకూడదు అనుకున్నాడు శాస్తుర్లు గారు. అందుకే దేశం నలుమూలలా తిరిగి వెలలేని తాళపత్ర గ్రంథాలను సేకరించాడు. అష్టగారుడ ఫణి నిదానము నూరిపోశారు చిన్న కొడుకుకు. బ్రహ్మగారుడాన్ని బోధించాడు. సమస్త నాగజాతినీ అడ్డుకోగలిగిన విద్యలను చిన్నకొడుకుకు నూరిపోశాడు. ఒక్కమాటలో చెప్పాలంటే అపర గరుత్మంతుడిని చేశాడు.

క్రమేపీ పూర్తి సర్పలక్షణాలను చూపించడం మొదలుబెట్టాడు పెద్ద కొడుకు. రాత్రుళ్ళు చెట్టూపుట్టా పట్టుకుని తిరిగేవాడు. రెండుకాళ్ళమీద నడవడంకంటే చేతులమీద పాకడానికి యిష్టపడేవాడు. అతడి గదినిండా ఎలుకల, కప్పల కంపు కొట్టేది. బ్రహ్మ గారుడం వల్లెవేస్తున్న తమ్ముడిని భరించలేకపోయేవాడు. తమ్ముడిని చూస్తే భయపడుతూ, బుసకొడుతున్నట్లుగా శ్వాసతీస్తూ మూలకు నక్కేవాడు. కాలక్రమంలో అంతకన్నా భయంకరమైన పరిణామం చోటుచేసుకుంది.

పౌర్ణమి దగ్గరికి వస్తున్నకొద్దీ తీవ్రంగా బుసలు కొడుతూ తప్పించుకుపోయేవాడు. రజస్వలలైన యువతులు కనిపిస్తే మీదపడడానికి ప్రయత్నించేవాడు. అడపాదడపా పున్నమి రాత్రుల్లో నురగలు కక్కుతూ మెలికలు తిరిగిన యువతులు అతడి కామవాంఛకు బలవంతంగా బలి అయినవాళ్లే. ఎంతఘోరం జరుగుతున్నది అనే ఆవేదన ఒకప్రక్కన, ఎవరికీ తెలియకుండా ఎంతకాలం వుంటుంది అనే ప్రశ్న ఒకప్రక్కన వేధించేది తండ్రిని. ఎవరికైనా

తెలిసిన మరుక్షణం పెద్దకొడుకును రాళ్లతో, కర్రలతో కొట్టి చంపుతారు అన్న ఆలోచనతో తల్లడిల్లిపోయేవాడు. రెండుమూడు సార్లు తనచేతులతోనే కొడుకును అంతమొందించాలనే ప్రయత్నం చేసేదాకా వెళ్ళింది ఆయన మానసికవేదన. నాగుమయ్య అడ్డుపడ్డాడు తండ్రికి. చివరికి యింతవరకూ వచ్చింది.

తల్లి చనిపోయిన రోజు తెల్లవారుఝామునుండీ తన అన్న కనిపించకుండా పోయింది కూడా అందుకే అని గ్రహించాడు నాగుమయ్య. తనబిడ్డను ఏదో విషపు పురుగు కరిచింది, మల్లెపొదలో నురగలు కక్కుతూ కనిపించింది అని ఆ యువతి తండ్రి ఏడుస్తూ చెప్పగానే అర్థమయ్యింది ఏం జరిగిందో. ఆమెను తన కామంతో కాటేసి, నాగజెముడు పొదల్లో సేద దీరుతున్నాడు తన అన్న. అక్కడ తండ్రిని చూసి సరసరా యింటికి వచ్చాడు. మరలా రాత్రంతా ఎక్కడ తిరుగుతున్నావని తల్లి కర్రతో కాళ్ళమీద కొట్టేప్పటికి ఆమె మీదపడి కరిచి యింట్లోంచి వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఏం జరిగిందో యే రాత్రో యే చాటునుండో చూసి గ్రహించి వుంటాడు. ఇక ఎన్నడూ తిరిగి రాడు అనుకున్నాడు నాగుమయ్య.

' నాకు మాట యిస్తావా నాగుమయ్యా? ' అన్న తండ్రి మాటతో ఆలోచనలనుండి తేరుకున్నాడు నాగుమయ్య. మౌనంగా తలపంకించాడు సరే అన్నట్లుగా. ' నాకై నేను తనకు యే ప్రాణహానీ తలపెట్టను..' అని .. ' తాను ఎక్కడున్నదీ..' అని చెప్పబోయి సందేహిస్తూ ఆగిపోయాడు నాగుమయ్య. 'నాకు తెలుసు' అంటూ చిన్నగా నిట్టూర్చాడు తండ్రి. ' పాండవులగుట్టమీద .. కనిపించి.. అంతలోనే కనుమరుగయ్యాడు ' అంటూ మౌనంగా వుండిపోయాడు.

పక్కన ఎవరింటి మీదినుండో కోడికూత వినిపించింది. మౌనంగా చేతివేళ్లమీద లెక్కించాడు శాస్తుర్లుగారు. ' నాన్నా నాగుమయ్యా! నీ చేతితో ఎన్నడూ ఏ సర్పాన్నీ చంపకు, ఎవరైనా చంపుతుంటే చూడకు! నిన్ను సిద్ధపురుషుడిని చేశాను. వర్ధిల్లు! నీ జ్ఞానసంపద నీకు తోడు! శోకంతో కుమిలిపోకు! బాంధవ్యం అంతా మిథ్య! యిదంతా ఆట!' అంటూ కనులు మూసుకున్నాడు. పద్మాసనంలో ధ్యానముద్రలో వుండిపోయాడు. అంతవరకూ గుబురుగా పెరిగిన నందివర్ధనం చాటున ముణగదీసుకుని వింటున్న ఆకారం వడిగా ముందుకు పాకబోయి ఆగిపోయింది.

తండ్రికి రెండుచేతులూ జోడించి చూస్తూ వుండిపోయాడు నాగుమయ్య. చెంపలమీదుగా ధారలుగా కారుతున్న కన్నీరు మునిమునిచీకట్లు తొలుగుతున్న వెలుగులో తళతళలాడుతూ కనిపిస్తున్నది. ఆయాసపడుతున్నట్లుగా భారంగా శ్వాసతీయడం మొదలుబెట్టాడు శాస్తుర్లుగారు. మూడుసార్లు ఓం ఓం ఓం అని వెనక్కు వాలిపోయాడు. నందివర్ధనం చాటున పొంచిన ఆకారం వెనక్కు వెనక్కు నెమ్మదిగా పాకుతూ, వేగంగా పొదలమధ్యన మాయమైంది. గద్గదమైన కంఠంతో తండ్రిని పిలుస్తూ సమీపించి, రోదించడం మొదలుబెట్టాడు నాగుమయ్య..

(కొనసాగింపు వచ్చే సంచికలో..)

COMMENTS